గంధం మహోత్సవం



ప్రార్థనల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌

కుత్బుల్లాపూర్‌: చింతల్‌ హెచ్‌ఎంటీ మెయిన్‌ రోడ్డులో గల దర్గాలో సయ్యద్‌ ఖాజా భాయ్‌ ఆధ్వర్యంలో సోమవారం గంధం మహోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత కూన శ్రీశైలంగౌడ్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సయ్యద్‌ ఇబ్రహీం, సయ్యద్‌ కాజా బాయ్‌, మహమ్మద్‌ ఇబ్రహీం, మహమ్మద్‌ ఇస్మాయిల్‌, మహమ్మద్‌ ఖాజా మియా, షాకీర్‌, మహమ్మద్‌ షరీఫ్‌, లక్ష్మీనారాయణ, సయ్యద్‌ ఇమ్రాన్‌, మహమ్మద్‌ అలీ, నవాజ్‌, ముంతాజ్‌, గౌస్‌, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల పొగతో ప్రజల అవస్థలు..!



పరిశ్రమ నుంచి దట్టంగా వెలువడుతున్న పొగ

జీడిమెట్ల: జీడిమెట్ల పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ వల్ల పారిశ్రామికవాడకు ఆనుకుని ఉన్న ఎస్‌ఆర్‌ నాయక్‌నగర్‌, అపురూపా కాలనీ, సాయిబాబానగర్‌, సుభాష్‌నగర్‌ కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌లోకి నేరుగా వస్తున్నది. కార్బన్‌ పొగ ద్వారా ప్రజలకు తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిబంధనల ప్రకారం పరిశ్రమల నుంచి వెలువడే పొగను ప్రస్తుతం ఉన్న మాడ్రన్‌ టెక్నాలజీ ఆధారంగా గొట్టాల ద్వారానే ఫిల్టర్‌ చేయాలి కానీ కొన్ని పరిశ్రమల యజమానులు ఇవేమీ పట్టించుకోకుండా విచ్చలవిడిగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లింగస్వామి

దుండిగల్‌: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ దుండిగల్‌–గండిమైసమ్మ మండల కన్వీనర్‌ బొడిగె లింగస్వామి అన్నారు. గండిమైసమ్మ చౌరస్తాలో ఆటో డ్రైవర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది యువకులు చదువుకుని సరైన ఉద్యోగ అవకాశాలు లేక ఆటోలు నడుపుతూ జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారాలు అందడం లేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ ఆటో డ్రైవర్లకు అనేక హామీలు ఇచ్చిందని కానీ అమలులో మాత్రం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. తక్షణమే ఆటో డ్రైవర్లను ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్‌ నాయకులు భిక్షపతి, ముజాహిద్‌, శంకర్‌ నాయక్‌, నాగరాజు, వెంకటేశ్‌, నవీన్‌, వెంకటేశ్‌గౌడ్‌, శివ తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని వినతి



ఏఈ చైతన్యకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సుభాష్‌నగర్‌: లోఓల్టేజీ సమస్యతో విద్యుత్‌ ఉపకరణాలు పాడవుతున్నాయని, పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గాజులరామారం ఉషాముళ్లపూడి సబ్‌స్టేషన్‌లో ఏఈ చైతన్యకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్‌ మాట్లాడుతూ రోడామేస్త్రీనగర్‌–బీలో కొన్ని రోజులుగా లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీంతో ఇళ్లలోని ఫ్యాన్లు, ట్యూబ్‌లు, ఇతర విలువైన విద్యుత్‌ ఉపకరణాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సిబ్బందికి సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదని, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి పరిష్కరించాలని కోరామన్నారు. అదేవిధంగా మీటర్‌ రీడర్లు సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జాకీర్‌ హుస్సేన్‌, ఆరీఫ్‌ బాబా, ముక్తార్‌, నజీం షరీఫ్‌, షోయబ్‌ తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి 6 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్‌: గాజులరామారం, కుత్బుల్లాపూర్‌ సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ పరిధిలో టౌన్‌ప్లానింగ్‌ (2), ఇంజినీరింగ్‌ (4) మొత్తం 6 ఫిర్యాదులు వచ్చాయి. ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి ఫిర్యాదులను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్‌: విద్యుత్‌ ఫీడర్‌ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం సరఫరాలో అంతరాయం ఉంటుందని షాపూర్‌నగర్‌ సెక్షన్‌ ఏఈ కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ భగత్‌సింగ్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భగత్‌సింగ్‌నగర్‌, సాయిబాబానగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి హ్యాండ్‌ రైటింగ్‌పై శిక్షణ

జగద్గిరిగుట్ట: పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల చేతిరాతను మెరుగు పరిచేందుకు నేటి నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జగద్గిరిగుట్ట జడ్పీహెచ్‌ఎస్‌ ప్రధానోపాధ్యాయుడు సుభాష్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జితేందర్‌ హ్యాండ్‌ రైటింగ్‌ అకాడమీ డైరెక్టర్‌ మల్లయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోని పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు.

అభిషేకాలు.. ప్రత్యేక పూజలు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: కార్తీక మాసం మొదటి సోమవారం భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయాల్లో అభిషేకాలు చేసేందుకు బారులుతీరారు. ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ ఆర్‌ఆర్‌నగర్‌లోని శివాలయంలో స్థానిక కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దం మహేష్‌యాదవ్‌, మన్నే వెంకట్‌యాదవ్‌, చందు యాదవ్‌, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొని అభిషేకాలు నిర్వహించారు.

కార్తీకమాసం మొదటి సోమవారం కిటకిటలాడిన శివాలయాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లాపూర్‌, మూసాపేట డివిజన్లలో..

మోతీనగర్‌: అల్లాపూర్‌, మూసాపేట డివిజన్లలోని పలు శివాలయాలకు భక్తులు ఉదయం నుంచి తరలివచ్చారు. మూసాపేట డివిజన్‌లోని పాండురంగ నగర్‌, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలోని శివాలయంలో ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 4.30 గంటలకు గణపతి పూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక అర్చనలు చేశారు. అదే విధంగా కబీర్‌నగర్‌ శివరామాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్లాపూర్‌ డివిజన్‌లోని వి. రామారావు నగర్‌, శ్రీ వివేకానందనగర్‌, పర్వత్‌నగర్‌లలోని పర్వత వర్ధిని శివాలయం, శివబస్తీతో పాటు పలు బస్తీ కాలనీల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

భరత్‌నగర్‌ కాలనీలో..

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని హరిహర క్షేత్రంలో సోమవారం కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. ఉదయం 5 గంటల నుంచే ఆలయ అర్చకులు కృష్ణ సూరి సమక్షంలో అభిషేకాలు జరిగాయి. మొదటి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూసాపేట్‌లో..

మూసాపేట: కార్తీక సోమవారం సందర్భంగా మూసాపేట్‌లోని సిద్ధి లింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూసాపేట మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌ కుమార్‌ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



శివాలయంలో అభిషేకం చేస్తున్న కార్పొరేటర్‌ నర్సింహాయాదవ్‌



హరిహర క్షేత్రంలో లింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు



సామూహిక అర్చనలు చేస్తున్న భక్తులు

10న సదర్‌ ఉత్సవాలకు రండి



మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న జేకే శేఖర్‌యాదవ్‌

జగద్గిరిగుట్ట: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 10న జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్‌లో సదర్‌ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కుత్బుల్లాపూర్‌ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్‌, యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేకే శేఖర్‌ యాదవ్‌ తెలిపారు. రాష్ట్ర యాదవ సంఘం సభ్యుడు, మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సదర్‌ ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేసి సత్కరించారు. యాదవ సంఘం సభ్యులు సమ్మయ్య యాదవ్‌, జగదీష్‌ యాదవ్‌, కుమార్‌ యాదవ్‌, రాజు నేత, రవి యాదవ్‌ తదితరులు ఉన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి



మేయర్‌ నీలారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఆల్విన్‌ మాజీ ఉద్యోగులు, వీర్‌భగత్‌సేవక్‌ సభ్యులు

నిజాంపేట్‌: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్‌ కార్పొరేషన్‌ మేయర్‌ కొలన్‌ నీలారెడ్డి అన్నారు. ప్రగతినగర్‌కు చెందిన ఆల్విన్‌ కంపెనీ మాజీ ఉద్యోగులు, వీర్‌ భగత్‌సేవక్‌ సంఘం సభ్యులు సోమవారం ఆమెను మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతినగర్‌లో దహన సంస్కారాలు నిర్వహించేందుకు స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వైకుంఠ ధామాన్ని ఏర్పాటు చేయాలని కోరగా మేయర్‌ సానుకూలంగా స్పందించారు. ఆల్విన్‌ మాజీ ఉద్యోగులు కృష్ణంరాజు, బలవంత్‌రెడ్డి, నర్సింహులు, సారయ్య, విజయ్‌ కుమార్‌, రమేశ్‌, వీర్‌ భగత్‌ సేవక్‌ ప్రెసిడెంట్‌ వంశీకృష్ణ, ట్రెజరర్‌ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైఫిల్‌ షూటింగ్‌లో సత్తా

మూసాపేట: రైఫిల్‌ షూటింగ్‌లో సత్తా చాటిన కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్‌ వెంకటయ్య అభినందించారు. స్కూల్‌ గేమ్‌ ఫెడరేషన్‌ అండర్‌–19 ఆధ్వర్యంలో సోమవారం గచ్చిబౌలిలో జరిగిన జిల్లాస్థాయిలో పోటీల్లో కళాశాలకు చెందిన సందీప్‌ మొదటి స్థానం, వివేక్‌ రెండో స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

విరాళం అందజేత

మోతీనగర్‌: కబీర్‌నగర్‌, అవంతినగర్‌, మోతీనగర్‌ ఎక్స్‌టెన్షన్‌లో నిర్మించిన శివ రామాంజనేయ దేవాలయంలో ధూప దీప నైవేద్యం, అలంకరణ కోసం భక్తుడు సత్యనారాయణ రూ.లక్ష విరాళాన్ని ఆలయ ప్రధాన సేవకుడు రమేష్‌ అయ్యంగార్‌కు అందజేశారు.

రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలి

కుత్బుల్లాపూర్‌: అసంపూర్తిగా ఉన్న రోడ్ల విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ కొంపల్లి మున్సిపల్‌ కాంగ్రెస్‌ సీనియర్‌ నేత జెమ్మి దేవేందర్‌ కోరారు. ఈమేరకు మేడ్చల్‌ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి రోడ్డులో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారని, అయితే కొన్ని చోట్ల అడ్డుగా నిర్మాణాలను తొలగించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొన్ని చోట్ల కూల్చివేసిన షెడ్లు, ఇతర నిర్మాణాలు మళ్లీ చేపడుతున్నారని, అధికారులు స్పందించి వాటిని తొలగించి స్థానికుల ఇబ్బందులను పరిష్కరించాలని వినతిలో కోరారు. కొంపల్లి మున్సిపల్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్‌ , సన్న శ్రీనివాస్‌ యాదవ్‌ తదితరులు ఉన్నారు.



మంజీరా నీటిని సరఫరా చేయాలని..

దుండిగల్‌: మంజీరా నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించాలని డి.పోచంపల్లి కౌన్సిలర్‌ బండారి మహేందర్‌ యాదవ్‌ కోరారు. ఈ మేరకు వాటర్‌ వర్క్స్‌ మేనేజర్‌ ప్రసాద్‌, మున్సిపల్‌ కమిషనర్‌ సత్యనారాయణను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. డి.పోచంపల్లి 9వ వార్డులోని ఇంద్రానగర్‌లో 30 రోజులుగా మంజీరా నీరు రావడం లేదని, వెంటనే సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా గతంలో ఆధార్‌ కార్డుతోనే ఇంటింటికీ తాగునీటి నల్లా కనెక్షన్లు ఇచ్చారని, ప్రస్తుతం ఇతర పత్రాలు అడుగుతున్నారని, ఆధార్‌తోనే నూతనంగా కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. నీటి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కుసుమ రావు, కిరణ్‌, సాయి, భూపతిరావు, రాజు, శేఖర్‌, లక్ష్మమ్మ, రాములమ్మ, పద్మ తదితరులు ఉన్నారు.

బీసీ వర్గాల అభ్యున్నతికే కులగణన



కూన శ్రీశైలంగౌడ్‌

కుత్బుల్లాపూర్‌: బీసీ వర్గాల అభ్యున్నతికే రాష్ట్ర ప్రభుత్వం కులగణన కార్యక్రమాన్ని చేపడుతున్నదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బోయిన్‌పల్లిలోని గాంధబు ఐడీయాలజీ సెంటర్‌లో మంగళవారం మధ్యాహ్నం కుల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరుకానున్న కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌గాంధీకి బోయిన్‌పల్లిలోని శ్రీలత గార్డెన్‌ వద్ద ఘనంగా స్వాగతం పలికేందుకు మధ్యాహ్నం 3 గంటలకు కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని శ్రీశైలంగౌడ్‌ కోరారు.

క్రైం కార్నర్‌..

కారును ఢీకొట్టి.. తాళం తీసుకెళ్లి..

సుభాష్‌నగర్‌: ఓ ఆటోవాలా కారును ఢీకొట్టడమే కాకుండా డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగి కారు తాళం తీసుకెళ్లిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బహదూర్‌పల్లికి చెందిన వివేక్‌ ఓ కంపెనీకి చెందిన కారుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే షాపూర్‌నగర్‌ నుంచి బహదూర్‌పల్లి వస్తుండగా సోమవారం 11:15 నిమిషాలకు సాయిబాబా నగర్‌ చౌరస్తా రాగానే ఆటోవాలా కారును ఢీకొట్టాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగగా ఆటో డ్రైవర్‌ కారు డ్రైవర్‌ వద్ద తాళం తీసుకుని వెళ్లిపోయాడు. దీంతో కారు రోడ్డులో ఆగిపోగా కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఇంతలో జీడిమెట్ల ట్రాఫిక్‌ పోలీసులు అక్కడికి చేరుకుని కారును రోడ్డు పక్కకు తరలించారు. అనంతరం వివేక్‌ సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రోడ్డు మధ్యలో నిలిచిపోయిన కారు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సుభాష్‌నగర్‌: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు జిల్లాకు చెందిన విష్ణుప్రియ (33), నరసింహారెడ్డి దంపతులు. కొన్నేళ్ల క్రితం సూరారం గ్రామానికి వలస వచ్చి ఉంటున్నారు. వీరు స్థానికంగా ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తున్నారు. నరసింహారెడ్డి, విష్ణుప్రియ ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా సూరారం లక్ష్మీనగర్‌ వద్దకు రాగానే ట్యాంకర్‌ను ఓవర్‌టేక్‌ చేస్తున్న క్రమంలో ఎదురుగా కారు రావడంతో బైక్‌ అదుపు తప్పి కింద పడిపోయింది. ఈ ఘటనలో ట్యాంకర్‌ చక్రం కిందపడిన విష్ణుప్రియకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానికంగా ఓ నాయకుడు ట్యాంకర్‌ యజమానితో బేరసారాలు కుదుర్చాడని స్థానికులు ఆరోపించారు. ఈ విషయమై సూరారం పోలీసులను 'సాక్షి' వివరణ కోరగా ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి..

దుండిగల్‌: మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌ జిల్లా కోయ్లకుంటకు చెందిన కడమంచి రమేశ్‌ (35) ప్రమీల దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. రమేశ్‌ ఎల్‌ఈడీ బల్బులు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వారం క్రితం రమేశ్‌ కుటుంబంతో వచ్చి సొరిగూడెంలోని జీపీఆర్‌ కాలనీలో గుడిసె వేసుకుని ఉంటున్నారు. ఈ నెల 3న రమేశ్‌ మద్యం తాగి మూత్ర విసర్జన చేసేందుకు చెట్ల పొదల్లోకి అదుపుతప్పి బోర్లా పడడంతో శ్వాస ఆడక అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి పరిశీలించగా చనిపోయి ఉన్నాడు. మూత్ర విసర్జన చేస్తూ కింద పడిపోయిన దృశ్యాలు సీసీ కెమెరా పుటేజీలో రికార్డయ్యాయి. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతసామరస్యానికి గ్యార్మీ ఉత్సవాలు

జగద్గిరిగుట్ట: మతసామరస్యానికి ప్రతీకగా గ్యార్మీ ఉత్సవాలు నిలుస్తాయని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్‌ అన్నారు. జగద్గిరిగుట్ట మగ్దూంనగర్‌లో సోమవారం మైనార్టీలు ఏర్పాటు చేసిన గ్యార్మీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో చాదర్‌ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్‌ కాంగ్రెస్‌ మైనార్టీ అధ్యక్షుడు ఎం.ఏ. హమీద్‌, మజీద్‌ కమిటీ సభ్యులు సాజిద్‌ ఖాన్‌, సులేమియా, కాంగ్రెస్‌ నాయకుడు బండి యాదగిరి, నరసింహ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో మాజీ అధ్యక్షుడు సతీశ్‌

నిజాంపేట్‌: నిజాంపేట్‌ కార్పొరేషన్‌ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్‌ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పార్టీ నుంచి ఆయన్ని సస్పెండ్‌ చేస్తూ జిల్లా ఇన్‌చార్జీ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో సతీశ్‌ రాష్ట్ర అధ్యక్షుడిని కలవడం చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా కార్పొరేషన్‌ పరిధిలో పార్టీ అభివృద్ధికి తాను చేసిన కృషిని కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. తనపై కక్షగట్టి కొందరు సస్పెండ్‌ చేయించారని, తనకు న్యాయం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడిని కోరినట్లు తెలుస్తోంది. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

దీక్షాపరుల సేవలో..!

- అయ్యప్ప భక్తులకు అండగా దొంతిరి నరసింహారెడ్డి
- యేటా సొంత ఖర్చులతో 20 మందికి అయ్యప్ప మాల
- శబరిమలకు తీసుకెళ్తున్న వైనం



సన్నిధానంలో పూజలు చేస్తున్న స్వాములు



భిక్ష పెడుతున్న నరసింహారెడ్డి

సుభాష్‌నగర్‌: అయ్యప్ప దీక్ష స్వీకరించాలని చాలామందికి కోరిక ఉంటుంది. కానీ ఆర్థిక పరిస్థితి బాగాలేక చాలామంది వేయలేకపోతుంటారు. అలాంటి వారికి సూరారం సాయిబాబానగర్‌ నరసింహాస్తీకి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్‌ దొంతిరి నరసింహారెడ్డి అండగా నిలుస్తున్నాడు. కొంతకాలంగా యేటా 15 నుంచి 20 మందికి సొంత ఖర్చులతో స్వగ్రామం యాదాద్రి జిల్లా మోటకొండూర్‌లో మాల వేయించి వారిని శబరిమలకు తీసుకువెళ్తున్నాడు.

ధూలపల్లిలో ఎకరా స్థలంలో..

ధూలపల్లిలోని జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డు ఎస్వీఎస్‌ కాంట వద్ద ఎకరా స్థలంలో సన్నిధానం ఏర్పాటు చేశారు. ప్రతిరోజు గురుస్వామి నాగేశ్వరరావు చేతుల మీదుగా నిత్య పూజలు జరుగుతున్నాయి. భక్తులకు ఇబ్బందుల్లేకుండా షెడ్డు వేయించి, తాగునీరు, పార్కింగ్‌ వంటి సదుపాయాలు కల్పించారు. నిత్యం మధ్యాహ్నం 12:30 నుంచి 1.30 గంట వరకు సన్నిధానంలో 300 పైగా అయ్యప్ప స్వాములు భిక్ష పెడుతున్నాడు. అంతేగాకుండా కరోనా సమయంలో దొంతిరి నరసింహారెడ్డి, నీరజ, కార్తీక్‌ రెడ్డి, జయవర్ధన్‌ రెడ్డి కుటుంబం లక్షలు ఖర్చు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. దీంతో అప్పటి సైబరాబాద్‌ సీపీ సజ్జనర్‌ రూ. 75 లక్షల చెక్కును వీరి కుటుంబానికి అందించగా వాటిని సైతం హోంగార్డ్‌ సంక్షేమానికి అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. దీంతో అప్పటి మేడ్చల్‌ కలెక్టర్‌ వెంకటేశ్వర్లు నరసింహారెడ్డి కుటుంబానికి ప్రశంసా పత్రం అందజేశా డు. తన సంపాదనలో కొంతభాగం పలు సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నానని దీంతో ఆత్మసంతృప్తి లభిస్తున్నదని నరసింహారెడ్డి తెలిపారు.

మొదటిసారి దీక్ష స్వీకరించా



ఉద్యోగరీత్యా కరీంనగర్‌ నుంచి నగరానికి వచ్చా. ప్రస్తుతం కొంపల్లిలో ఉంటున్నాను. చిన్నప్పటి నుంచి అయ్యప్ప మాల స్వీకరించాలని ఉన్నా వేయలేకపోయాను. గురుస్వామి నరసింహారెడ్డి యేటా ఉచితంగా అయ్యప్ప మాల వేయించి, సొంతంగా శబరికి తీసుకెళ్తున్నాడని తెలియడంతో ఆయన చొరవతో దీక్షా చేపట్టిన. తొలిసారిగా శబరిమల వెళ్లనుండడం సంతోషంగా ఉంది.

– కిరణ్‌, కొంపల్లి